అప్పు చేసి వడ్డిస్తున్నాం..

- ఆరు నెలలుగా అందని గౌరవ వేతనం
- ఏడాదిగా రాని 9, 10 తరగతుల బిల్లులు
- బిల్లులు రాక వంట ఏజెన్సీల అవస్థలు
- వెంటనే బిల్లులు చెల్లించాలని వేడుకోలు


సంగెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

సంగెం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యలను పెంచాలని, డ్రాపౌట్ తగ్గించాలనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. కానీ విద్యార్థులకు రుచికరమైన వంట చేసి వడ్డిస్తున్న ఏజెన్సీల గోడు పట్టించుకునే వారు లేరని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిగా వంట బిల్లులు రాకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఐదు నెలల నుంచి గౌరవ వేతనం, ఏడాది నుంచి వంట బిల్లులు, గుడ్డు బిల్లులు రాక అప్పుల పాలవుతున్నామని వంట నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 60 ప్రభుత్వ పాఠశాలల్లో 1,983 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 9–10 తరగతుల్లో 760 మంది విద్యార్థులున్నారు. 80 మంది వంట కార్మికులు గౌరవ వేతనం పొందుతూ వంట చేసి పెడుతున్నారు. వీరికి మార్చి నుంచి గౌరవ వేతనం అందాల్సి ఉంది.

పెండింగ్‌లోనే వంట బిల్లులు

1–8 తరగతుల వారికి బిల్లులు మార్చి నుంచి జూలై వరకు, 9, 10 తరగతుల విద్యార్థులకు గతేడాది నవంబర్ నుంచి బిల్లులు అందాల్సి ఉంది. కోడి గుడ్ల బిల్లులు గతేడాది సెప్టెంబర్ నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో నిర్వాహకులకు కాస్త గిట్టుబాటు అవుతుండగా తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో కనీసం కూలి గిట్టుబాటు కాక వంట నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో కిరాణం, గుడ్లు, కూరగాయల కోసం అప్పులు పెరిగిపోవడంతో నానా అవస్థలు పడుతూ వంట చేసి పెడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంట చేసిన బిల్లులు, కోడి గుడ్ల బిల్లులు, గౌరవ వేతనం సకాలంలో అందించాలని పలువురు వంట ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



ఏడాది నుంచి బిల్లులు రాలేదు. అప్పులు చేసి మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నాం. నగలు, ఆస్తులు తాకట్టు పెట్టడంతో పాటుగా అప్పులు చేసి ఇబ్బంది పడుతూ సరుకులు, గుడ్లు కొనుగోలు చేస్తున్నాం. నెల నెలా బిల్లులు చెల్లిస్తే అప్పుల బాధ తప్పుతుంది. ప్రభుత్వం దయ చూపి వెంటనే బిల్లులు మంజూరు చేయాలి.

- షాహెదా, వంట నిర్వాహకురాలు

బిల్లులు చేసి పంపించాం..



మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు సకాలంలో అందేందుకు కృషి చేస్తున్నాం. నెలనెలా బిల్లులు చేసి పంపిస్తున్నాం. 1 నుంచి 8 తరగతుల వారికి ఏప్రిల్, జూన్, జూలై బిల్లులు ఎస్టీఓకు వచ్చాయి. త్వరలో అకౌంట్లలో జమకానున్నాయి. 9, 10 తరగతుల వారి బిల్లులు పంపించాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి బిల్లులు త్వరగా వచ్చేలా చూస్తాం.

- విజయ్‌కుమార్, ఎంఈఓ, సంగెం

బీజేపీ వస్తే డబుల్ బెడ్రూం ఇళ్లు

పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి


పథకాలను వివరిస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి

సంగెం : డబుల్ బెడ్రూం ఇళ్లు కావాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. గురువారం మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండలంలోని బాలునాయక్ తండా, గుట్టకింది తండా, తోట్ల తండా, ముమ్మడివరంలో ఆయన ఇంటింటికి పర్యటించి మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు బీఆర్‌ఎస్ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని మభ్యపెట్టి ఓట్లు వేయించుకుని నేడు గృహలక్ష్మి అంటూ మరోమారు మభ్యపెడుతోందని విమర్శించారు. ఇంటింటికి మిషన్‌భగీరథ తాగునీరు ఇస్తామని చెప్పి చుక్క నీరు ఇవ్వలేదు కానీ వీధి వీధికి లిక్కర్ షాపులు తెరిపించి యువతను తాగుబోతులను చేసిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతనే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, నాయకులు శేషాద్రి, వీరయ్య, వెంకన్న, చంద్రమౌళి, సతీష్, ముకుందం, రమేష్, కొమ్మాలు, సారమ్మ, శ్రీనివాస్ రాజమౌళి, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


మాట్లాడుతున్న మేనేజర్ వేణుధనుంజయ

దుగ్గొండి : బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులు, వ్యాపారులు, మహిళలు సకాలంలో చెల్లింపులు చేస్తూ బ్యాంకుకు నమ్మకస్తులుగా ఉండి పరపతి సంపాదించుకోవాలని మేనేజర్ కనకాల వేణుధనుంజయ అన్నారు. మండలంలోని మందపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహనలో భాగంగా గురువారం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీవన్‌జ్యోతి, సురక్షా బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాలలో ప్రీమియం చెల్లించి భద్రత పొందాలన్నారు. పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. ప్రతి వ్యక్తి బ్యాంకులో ఖాతా కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు ప్రతినిధి భాస్కర్, సర్పంచ్ మొగ్గం మహేందర్, బ్యాంక్ మిత్ర రాతు సౌందర్య పాల్గొన్నారు.

రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు


విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గీసుకొండ : రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు, వాగ్దానాలను నెరవేర్చని సీఎం కేసీఆర్ పెద్ద ఛీటర్, ఫోర్ ట్వంటీ అని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆరోపించారు. గురువారం మండలంలోని కొనాయమాకుల వద్ద జిల్లా నాయకులు చాడ కొమురారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా తమ నాయకుడు టీపీసీసీ అధ్యక్షుడు రేవంతర్‌రెడ్డిపై 420 అంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని అన్నారు. మంత్రి పదవిలో హూందాగా వ్యవహరించాల్సింది పోయి గల్లీ లీడర్‌లా వ్యవహరించారని ఆరోపించారు. దళితుడిని సీఎం చేస్తానని, పేద దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని, నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రజలను మోసం చేసిన సీఎం కేసీఆర్ మోసకారి అని అన్నారు. జిల్లా, మండల నాయకులు సాయిలి ప్రభాకర్, అప్పని కరుణాకర్, కూసం రమేష్, వజ్ర రాజు, ఎండీ రహీం, కాందారి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల రాస్తారోకో


వర్ధన్నపేటలో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

వర్ధన్నపేట : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా గురువారం వర్ధన్నపేట పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఆ పార్టీ శ్రేణులు రాస్తారోకో, ధర్నా చేసి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరగంటకు పైగా రోడ్డుపై రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు ఆందోళన కారులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కొండేటి సత్యం, చీటూరి రాజు మాట్లాడుతూ.. ప్రజాప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య బద్ధంగా ప్రశ్నిస్తే కిషన్‌రెడ్డిని అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషణ వారోత్సవాలు



రాయపర్తి : ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సత్యవతి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని కొత్తరాయపర్తి అంగన్‌వాడీసెంటర్‌లో పోషణ వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గారె నర్సయ్య, అంగన్‌వాడీ టీచర్ ఐత కృష్ణవేణి, ఆయా రజిత తదితరులు పాల్గొన్నారు.

పాటల సీడీ ఆవిష్కరణ


సీడీ ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చిలువేరు శ్రీనివాసులు 'బతుకు మారాలన్నా.. మెతుకు దొరకాలన్నా.. చదువుతోనే సాధ్యం' అనే పాటను రాసి స్వరకల్పన చేశారు. ఈమేరకు పాటల సీడీని హెచ్‌ఎం నాగేశ్వరాచారి, ఉపాధ్యాయులు గురువారం ఆవిష్కరించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదువుకుంటే జీవితంలో గొప్పవారు అవుతారన్నారు. ఉపాధ్యాయులు సారయ్య, సుశీల, కౌర్, సంధ్యారాణి, అయిలయ్య, విష్ణువర్ధన్, వీరస్వామి, రమాదేవి, నీరజ పాల్గొన్నారు.

కోళ్ల వ్యాపారులకు జరిమానా

చెన్నారావుపేట : రోడ్డుకు ఇరువైపులా కోళ్ల వ్యర్థాలు వేస్తున్న చికెన్ సెంటర్ల యజమానులకు జరిమానా విధించినట్లు పంచాయతీ కార్యదర్శి రాజేందర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా రూ.3వేల జరిమానా విధించిన సిబ్బందిని సర్పంచ్ మల్లయ్య అభినందించారు. కార్యక్రమంలో కారోబార్ సురేష్, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


రాయపర్తి: ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్


నెక్కొండ: నివాళులర్పిస్తున్న దొంతి మాధవరెడ్డి

రాయపర్తి : మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఊడుగుల వెంకన్న గురువారం అనారోగ్యంతో మృతిచెందగా బీఆర్‌ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి పరామర్శించారు. అలాగే మైలారం గ్రామానికి చెందిన గబ్బెట వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందగా సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎంపీటీసీ గాడిపెల్లి వెంకన్న, గబ్బెట యాకయ్య, బండ యాదగిరి, గాడిపెల్లి రాములు, నాయకులు ఉన్నారు.


పలువురి పరామర్శ

నెక్కొండ : మండల కేంద్రానికి చెందిన కోమండ్ల ఉప్పల్‌రెడ్డి అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. కాగా, ఉప్పల్‌రెడ్డి మృతదేహాన్ని పలువురు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, వివిధ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

పరామర్శ

నర్సంపేట : నర్సంపేటకు చెందిన పెండెం ఆనంద్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆనంద్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు తగదు'


మాట్లాడుతున్న తూళ్ల కుమారస్వామి

వర్ధన్నపేట/పర్వతగిరి : బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌పై కాంగ్రెస్ నాయకుడు నాగరాజు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని వర్ధన్నపేట, పర్వతగిరి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు తూళ్ల కుమారస్వామి, రంగు కుమార్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆయా మండల కేంద్రాల్లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు రాజకీయ విచక్షణ కలిగిన వారని, మంచేదో..చెడేదో తెలుసుకోలేని వారు బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడడం సరికాదన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. డబ్బుల రాజకీయాలకు భయపడే వారు లేరని అన్నారు. ఆయా సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


చెన్నారావుపేట: ఉప్పరపల్లిలో నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు


ఖానాపురంలో.. ప్రిన్సిపాల్, అధ్యాపకులు


రాయపర్తి: హిందీ ఉపాధ్యాయురాలికి సన్మానం


వర్ధన్నపేట: హిందీ భాషా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాజలింగం, ఉపాధ్యాయులు మహ్మద్ ముజీబ్ ఉర్ రహ్మాన్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో హిందీ భాషా దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం హిందీ భాష గొప్పతనాన్ని చాటుతూ వ్యాసరచన పోటీలు, నాటికలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, హెచ్‌ఎంలు అండెం కర్ణాకర్‌రెడ్డి, ఉమారాణి, హిందీ ఉపాధ్యాయులు బొనగాల రమేష్, మురళి, కృష్ణ, కుమార్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మొదట సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం చిన్నారులు హిందీలో నాటికలు వేసి పాటలు పాడుతూ అలరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో హిందీ భాషకు ప్రత్యేకత ఉందన్నారు. దేశ ప్రజలందరిని ఒక్కతాటిపైకి తెచ్చిన ఘనత హిందీ భాషకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడ్డం మాధవి, సుమలత, సుధీర్‌కుమార్, కరంచంద్, వెంకట్రావ్, కమల, నాగరాజు, ప్రదీప్, అనురాధ పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో..

వర్ధన్నపేట : హిందీ భాషా దినోత్సవాన్ని మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ భాషా హిందీని విద్యార్థులు అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషారాణి, రాజు, లలిత్‌కుమార్, ఎం రాజు, అరుణదేవి, వీరస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీ భాషపై పట్టును సాధించాలి

రాయపర్తి : అన్ని ప్రాంతీయ భాషలన్నింటికెల్లా దేశంలో అత్యధిక వ్యక్తులు మాట్లాడే భాష హిందీనేనని హిందీ భాషపై పట్టు సాధించాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రావుల భాస్కర్‌రావు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ సందర్భంగా పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు గుగులోత్ సునీతను సన్మానించడంతోపాటు విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులు శివపురం వీరభద్రశర్మ, గాదె ప్రవీణ్‌రెడ్డి, మారం రోజారాణి, గాండ్ల మమత, కడగాయు రోహిణి, కోలా దేవేందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఖానాపురంలో..

ఖానాపురం : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాపల్ ఆరుట్ల శేషచారి మాట్లాడుతూ హిందీ భాషకు ఉన్న ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. హిందీ అధ్యాపకురాలు కందాల రమాదేవి, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీఓ సదానందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


దుగ్గొండి: నాచినపల్లి ఉన్నత పాఠశాలలో..


కేక్ కట్ చేస్తున్న సిద్ధార్థ సంస్థల చైర్మన్ గోపాల్‌రెడ్డి


నర్సంపేట రూరల్ : గురిజాల హైస్కూల్‌లో..

ప్రభుత్వ న్యాయవాది మృతి



నర్సంపేట రూరల్ : నర్సంపేట సివిల్ కోర్టులో ఏజీపీగా విధులు నిర్వర్తిస్తున్న గూళ్ల అశోక్‌కుమార్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. అశోక్ భౌతికకాయంపై ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జిలు సాయికుమార్, శిరీష, నర్సంపేట బార్ అసోసియేషన్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నర్సంపేట మున్సిఫ్ కోర్టులో రెండు నిమిషాలు మౌనం పాటించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్‌యాదవ్, సీనియర్ న్యాయవాదులు అంబటి శ్రీనివాస్, తండా సారంగపాణి, తోగరు నర్సింహారెడ్డి రహీమొద్దీన్, లక్ష్మీనారాయణ, సంజయ్, మోటూరి రవి, జన్ను మహేందర్, సిలువేరు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సబ్సిడీపై యంత్ర పరికరాలు

ఖానాపురం : రైతులకు 50శాతం సబ్సిడీపై యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కావాల్సిన రైతులు యంత్ర పరికరాల వివరాలతో పాటు ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, పాస్‌ఫొటోతో పాటు దరఖాస్తు పత్రాన్ని నింపి వ్యవసాయ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. డీడీలు తీయడానికి క్యూ ఆర్ కోడ్‌స్కానర్ వ్యవసాయ యాంత్రీకరణ పథకం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని, దాని ద్వారా డీడీలు తీసుకోవాలని సూచించారు.

ఐడీ కార్డుల పంపిణీ



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థులు సొంత ఖర్చుతో ఐడీ కార్డులను గురువారం పంపిణీ చేశారు. 1989–90 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు పాఠశాలపై మమకారంతో ఐడీ కార్డులను అందించారు. హెచ్‌ఎం సుజాత, ఎస్‌ఎంసీ కో ఆప్షన్ సభ్యుడు కొక్కొండ శ్రీకాంత్, గట్టికొప్పుల సదానందం, ప్రభాకర్, బాబూరావు, యాకలక్ష్మి, ప్రమీల, సరస్వతి, జమున, సాంబయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పర్వతగిరి : పర్వతగిరి సూర్యోదయ రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సీఈఓగా పని చేయడానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సంఘం చైర్‌పర్సన్ బొబ్బల కవిత తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ బీఎస్సీ అగ్రికల్చర్, ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ద్విచక్రవాహనం, 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. బిజినెస్ స్కిల్స్, వ్యవసాయం చేసిన అనుభవం కలిగి పర్వతగిరి మండలవాసులై ఉండి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించాలని చెప్పారు. అర్హత కలిగిన వారు పర్వతగిరిలోని మదర్ థెరిస్సా మండల సమాఖ్యలో ఈనెల 15, 16 తేదీల్లో మధ్యాహ్నం 12 గంటల వరకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

సన్మానం



రాయపర్తి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సరికొండ కృష్ణారెడ్డిని గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఉల్లెంగల యాదగిరి, అఫ్రోజ్ ఖాన్, ఎండీ మహమూద్, గబ్బెట బాబు, చిన్నపాక ఎల్లయ్య, భగవాన్, యాకూబ్, మచ్చ రమేష్, గారె సాయిలు, యాకయ్య, మంద రమేష్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

వర్ధన్నపేట : మండలంలోని కొత్తపల్లికి చెందిన నల్లతీగల రవీందర్‌ను కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ గురువారం హనుమకొండలో డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నియామక పత్రం అందజేశారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం ఎన్నిక


నర్సింహరాములు

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి గ్రామంలో పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ములుక నర్సింహరాములు, ఉపాధ్యక్షులుగా కటకం భిక్షపతి, చెట్టి నర్సింహరాములు, ప్రధాన కార్యదర్శిగా కటకం సతీష్, సహాయ కార్యదర్శులుగా వడ్డెపల్లి శివకుమార్, ములుక ఐలయ్య, కోశాధికారిగా బలభద్ర రమేశ్, కార్యవర్గ సభ్యులుగా రచ్చ మహేష్, కొండబత్తుల రవీందర్, ములుక విద్యాసాగర్, శెట్టి అశోక్, చల్ల రాజు, కోట చిన్నరాజు, ములుక రాజు ఎన్నికకాగా ముఖ్య సలహాదారులుగా పెండెం తిరుపతి, వడ్డెపల్లి చంద్రమౌళి, కొండ్లె చంద్రప్రకాష్ ఎన్నికయ్యారు.

ఆలయ కమిటీ ఎన్నిక



ఖానాపురం : శివరామ క్షేత్ర ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షులుగా పాపారావు, శ్రీనివాసరావు, సలహాదారులుగా రవీందర్‌రావు, రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు, రాంచందర్‌రావు, విజాకర్‌రావు, వెంకన్న, ఇతర సభ్యులతోపాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు.

శఠగోపం బహూకరణ

పర్వతగిరి : మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన దేవేందర్‌రావు–లక్ష్మి దంపతులు గురువారం కల్లెడ సాయిబాబా ఆలయానికి శఠగోపాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు.